క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి భారీగా భక్తులు



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.1,39,991 వచ్చినట్లు, 1400 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది భక్తులకు వైద్య సేవలందించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

పోలీస్ అమర వీరుల త్యాగం అజరామరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

బుట్టాయగూడెం: పోలీసు అమర వీరుల త్యాగం అజరామరమని జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమర వీరుల దినోత్సవాన్ని జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బలిమెల ఘటన, మేజర్ సందీప్, ఉన్ని కృష్ణన్, నంద్యాల పీసీ సురేంద్ర దారుణ హత్య వీడియోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్ కుమార్‌తో పాటు అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాతిరుమల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ద్వారకాతిరుమల సచివాలయం-2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజన విద్యార్థులకు సూచించారు. స్థానిక శ్రీనివాసా జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆమె విద్యార్థులకు సైబర్ నేరాలు, సైబర్ ఫ్రాడ్ లోన్ యాప్‌లపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. వీటి బారిన పడిన బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

దాబాపై విజిలెన్స్ అధికారుల దాడి



అధికారులు సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లు

ద్వారకాతిరుమల: నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న ఒక దాబా నిర్వాహకుడిపై విజిలెన్స్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేసి, 6 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే, మండలంలోని పంగిడిగూడెం ఫ్రెండ్స్ దాబాలో విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, సివిల్ సప్లై డీటీ ఎ.మాధవరావు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు, గృహ అవసరాలకు ఉపయోగించే డొమెస్టిక్ సిలిండర్లను దాబాలో వినియోగిస్తున్నట్టు గుర్తించారు. దీంతో అధికారులు రూ.16,546 విలువైన 6 హెచ్‌పీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి, దాబా నిర్వాహకుడు బెహర శివాజీపై 6ఏ కేసు నమోదు చేశారు.

అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వి.శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యపై మహిళల్లో అవగాహన మరింత పెరగాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే సమాజంలో అసమానతలు తగ్గుతాయన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రత్యేక చొరవతో అక్షరాస్యతపై మహిళల్లో అవగాహన పెంచి, విద్యావంతులను చేయాలన్నారు. తరగతిలో డ్వాక్రా సంఘాల సహాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఏజెన్సీ రహదారులు

- వాహనదారుల ఇక్కట్లు
- కనీస మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న స్థానికులు



ఇటికిలకోట-వింజరం గ్రామాల మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులు పడి వర్షం నీరు చేరిన దృశ్యం

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంతోపాటు అనేక రహదారులు గోతులు పడి అధ్వాన్నంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే గిరిజనులు నిత్యం అనేక అవస్థలు పడుతున్నామని, వాహనాలు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని పేర్కొన్నారు. పోలవరం మండలంలోని వై.జంక్షన్ నుంచి రేపల్లెవాడ అడ్డరోడ్డు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి, మెటల్ లేచిపోవడంతో ప్రజల రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో రామయ్యపేట, వింజరం వద్ద రెండు కల్వర్టులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం పాడై గుంతల్లో పలు చోట్ల వర్షం నీరు నిలిచిపోయింది. కల్వర్టులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రామస్తులు రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా కల్వర్టుల వద్ద మట్టి వేసి మరమ్మతులు చేసుకున్నారు. ఇటికిలకోట, వింజరం, గుంజవరం, సింగన్నపల్లి, చేగొండపల్లి మామిడిగొంది, బోడిగూడెం, కొమ్ముగూడెం గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిపై మండల కేంద్రమైన పోలవరం రావాల్సిందే. వర్షాలకు అక్కడక్కడ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు గోతుల్లో పడి గాయపడిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో పోలవరం ఆటోలపై రాత్రి సమయంలో చేరాలంటే రోగులు కూడా అనేక అవస్థలు పడుతున్నారని గిరిజనులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం 2012లోచేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. ఆటోల్లో వెళుతుంటే గతుకుల ప్రయాణం నరకంగా ఉందని పేర్కొంటున్నారు. ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలోనే నిర్వాసిత గ్రామాలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిత్యావసర సరుకులు కొనుగోలు నుంచి వైద్యసేవల కోసం వచ్చే వారు ఈ రోడ్డుపై ప్రయాణించాల్సిందే. రోడ్లు పాడవడంతో పడుతూ లేస్తూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గిరినులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

రాకపోకలకు తీవ్ర ఇబ్బంది



రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. వై.జంక్షన్ నుంచి రేపల్లెవాడ అడ్డ రోడ్డు వరకు రోడ్డు పాడైంది. గోతులమయంగా మారి ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది. రాత్రి వేళల్లో అయితే ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఎక్కడ ఎటువంటి ప్రయాదాలు చోటు చేసుకుంటాయోనని భయపడాల్సి వస్తోంది.

– బాదంశెట్టి రాంబాబు, స్థానికుడు, కొమ్ముగూడెం

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



వై.జంక్షన్ నుంచి రేపల్లెవాడ అడ్డరోడ్డు వరకు వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. రహదారిపై పెద్దపెద్దగోతులు ఏర్పడి వర్షం నీరు నిలిచిపోతోంది. ఈ రహదారి మీదుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు కూడా ఉండటంతో నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఆటోలు గోతుల్లో పడి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– షేక్ జాకీర్, ఆటో డ్రైవర్, మామిడిగొంది

బొర్రంపాలెం కార్యదర్శిగా నాగేశ్వరరావు



పగడం నాగేశ్వరరావు

టి.నరసాపురం: బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శిగా పగడం నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు బదిలీపై వెళ్లారు. కాగా నాగేశ్వరరావు ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ, బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గాదె అనిల్ కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అగ్రి కంపెనీ ఉద్యోగులు

వేలేరుపాడు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేలేరుపాడు మండలం రుద్రమకోటకు చెందిన గాదె అనిల్‌కుమార్ కుటుంబానికి అగ్రి కంపెనీ ఉద్యోగులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. అగ్రి కంపెనీలో పని చేసే ఖమ్మం ఎంప్లాయీస్ గ్రూప్, భద్రాచలం ఎంప్లాయీస్ గ్రూప్, కరీంనగర్, వరంగల్, కర్నూల్, తమిళనాడు, ఖమ్మం, భద్రాచలం డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కలిపి రూ.1.42 లక్షలు అనిల్ కుమార్ కుటుంబానికి అందజేశారు.

రంగస్థల నటుడు మృతి



గిరజవోలు సాంబశివరావు

కొయ్యలగూడెం: ప్రముఖ రంగ స్థల నటుడు, ప్రభుత్వ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గొరిజవోలు సాంబశివరావు (75) మృతి చెందారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాయపూడి వెంకటరమణ తెలిపారు. పౌరాణిక, జానపద నాటికలను సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ దేశాలలో ప్రదర్శించి పౌరాణిక బ్రహ్మగా ఆయన బిరుదు పొందారని తెలిపారు.

ఎస్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం



ఎస్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గం సమన్వయ కర్త కంభం విజయరాజు, కన్వెన్షన్ అధినేత బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: లింగపాలెంలో ఎస్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గం సమన్వయ కర్త కంభం విజయరాజు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, మాజీ రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయ్యాల నవీన్‌బాబు, మాజీ సొసైటీ చైర్మన్లు భీమిరెడ్డి సోమిరెడ్డి, ఉప్పలపాటి ప్రసాద్, బి.ప్రసాద్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, బి.ప్రభాకర్‌రెడ్డి, నూతులపాటి శ్రీను, పలువురు సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్జీనియా రైతులకు అవగాహన సదస్సు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు పంటల నియంత్రణపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలోని అచ్చియ్యపాలెం గ్రామంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏఎస్ గ్రేసీ మార్గరేట్ తెలిపారు. ఈ సందర్భంగా పరిమితి పంట, నిర్ణీత కోటా మేరకు విస్తీర్ణం తగ్గించి, పంట నాట్లు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, పల్లపు, చౌడు భూములలో పొగాకు పంట విధానం, అనధికార పొగాకు సాగు, అనధికార బ్యారన్ల నిర్మాణంపై తీసుకునే చర్యల గురించి వివరించినట్లు ఆమె తెలిపారు. రైతు శిక్షణలో భాగంగా గ్రీన్ సాంకేతికత (పాలీ హౌస్, గ్రీన్ హౌస్) నారుమడి తయారీ విధానంపై అధికారులతో కలిసి శిక్షణ ఇచ్చారు. రైతుల బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, రైతులు సకాలంలో పూర్తి చేసుకోవాలని, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది తెలిపారు.



వర్జీనియా రైతు సదస్సులో మాట్లాడుతున్న గ్రేసీ మార్గరేట్

ప్రజల మనసులు గెలిచిన నేత కోటగిరి



మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కామవరపుకోట: ప్రజల మనసులు గెలిచిన నేత మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అని మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు అన్నారు. మండలంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు ఆధ్వర్యంలో కామవరపుకోటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో మాజీ ఎంపీ శ్రీధర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, మండలాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మేడూరి రంగబాబు, సాయిన కనకరాజు, బొల్లు వెంకట సత్యనారాయణ, కొవ్వూరి భాగ్యరాజు, తమ్మిశెట్టి సుబ్రమణ్యం, బండారు ప్రసాద్, సాయిల స్వాతి, మేడంకి చిన్న, చింతపల్లి సుధా, మానుకొండ దేవరాజు, చిక్కాల శ్రీను పాల్గొన్నారు.

చింతలపూడి: మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటగిరి శ్రీధర్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఊటసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుధీర్, జగన్, చిన్న వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన

పోలవరం రూరల్: మండలంలోని కొత్తపట్టిసీమ, గూటాల రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. గత సంవత్సరం వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గోనె సంచులు అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులు తూర్పుగోదావరికి చెందిన తాళ్లపూడి, నిడదవోలు మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేస్తే రైతులకు రవాణా సులభంగా ఉంటుందని తెలిపారు. మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వం అందించే విధంగా చూడాలని రైతులు కోరారు. సేంద్రీయ వ్యవసాయంపై తెలియజేశారు. రైతులకు టార్పాలిన్‌లు కూడా సబ్సిడీపై అందించాలని రైతులు కోరారు.

లింగపాలెం: లింగపాలెం మండలం రంగాపురం రైతు సేవ కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ వ్యవసాయ, అనుబంధ విభాగాల పథకాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసునూరి రాము, గ్రామ రైతులు పాల్గొన్నారు.



లింగపాలెం: కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు ప్రజా ప్రతినిధులు



బుట్టాయగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్యకుంటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం (వెంకట్రామన్నగూడెం) శాస్త్రవేత్తలు వి.దీప్తి, డాక్టర్ పి.విజయలక్ష్మి, ఏవో డి.ముత్యాలరావు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో రెండు ఆకుల దశ నుంచి కత్తెర పురుగు ఆశించి పంటలు నాశనం చేస్తుందని చెప్పారు. వేప కషాయం, వేప నూనె వంటి వాటిని వినియోగించి కత్తెర పురుగును నివారించొచ్చని చెప్పారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ అధికారి పి.సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సంచాలకులు, పశువర్ధక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



చింతలపూడి: ఆందోళన చేస్తున్న కార్మికులు



జంగారెడ్డిగూడెం: ధర్నా చేస్తున్న కార్మికులు

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు టి.మరియమ్మ, టి.రాము, కూరపాటి నాగరాజు, కొడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, బి.వెంకట్రావు, వాణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారానికి మూడో రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పారిశుద్ధ్య కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నా పాలకులు కనికరించడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.26000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండల సీపీఐ కార్యదర్శి గొలిమే బాలయేసు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం కార్యదర్శి బొక్కా శ్రీను, హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల సూపర్ వైజర్స్ వేముల రాజు, బూరుగు సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తాం

టి.నరసాపురం: ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాడిన కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తామని మండలంలోని మర్రిగూడెం పంచాయతీ గిరిజనులు అన్నారు. కొమరం భీం జయంతి సందర్భంగా మంగళవారం మర్రిగూడెంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ గిరిజన జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయితీ గిరిజన పెద్దలు పొట్టా రామారావు, కురసం నిరీక్షణరావు, కుంజా లోకేష్, పూనెం ఆదిత్య, నాగేశ్వరరావు, కుంజా వీరాస్వామి, తుట్టి చిన్న నాగేశ్వరరావు, గొంది ప్రసాద్, మడకం వెంకటేశ్వరరావు, అళ్ళ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం కొమరం భీమ్, ఎస్‌ఆర్ శంకరన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు ఆదివాసీ ఐక్య కార్యాచరణ ప్రతినిధులు మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంవో కొవ్వాసి శిరమయ్య, డీవైఈవో కలుం నీలయ్య, జేఏసీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కుర్సం దుర్గారావు, తెల్లం లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



కేఆర్‌పురం ఐటీడీఏలో కొమరం భీమ్, శంకరన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని కాల్నిడి శ్రీరాములు అన్నారు. మండలంలోని బుచ్చిలేటిగూడెం గ్రామంలో మంగళవారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతా రామాంజనేయ చౌదరికి అభినందనలు తెలిపారు.

వనిలకు ఏఈవోగా పదోన్నతి



ద్వారకాతిరుమల: స్థానిక సచివాలయంలో వీఏఏగా విధులు నిర్వర్తిస్తున్న యేపూరి వనిల ఏఈఓగా పదోన్నతి పొందారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 30 మంది వీఏఏలకు పదోన్నతులు కల్పిస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ భాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వనిల భీమడోలు ఏఈవోగా నియమితులయ్యారు.

439 ఎక్సైజ్ కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాలపై 439 కేసులు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వివిధ ఎక్సైజ్ నేరాల్లో 439 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులకు గాను మొత్తం 233 మంది అరెస్టు చేసినట్లు తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పాత గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. తిరుమలాపురానికి చెందిన తమిర్చి మోషేకు, అదే గ్రామానికి చెందిన మాదాసు మంగరాజుకు పాత గొడవలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న మంగరాజు మరో 12 మందితో కలిసి మోషే ఇంటికి వెళ్లి మోషేను, అతని భార్యపై దాడి చేశారన్నారు. మంగళవారం మోషే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు.